


PRGI NO: TGTEL/25/A5314

# అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య    బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




నల్లగొండ    హైదరాబాద్    రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | గురువారం 02, జులై 2026 | సంపుటి :1 సంచిక : 181 | పేజీలు : 8 , వెల.2.00



### విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర.. ముగ్గురి అరెస్ట్..

తమిళనాడులో అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. 15 మంది టీవీకే ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి, ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలతో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. టీవీకే ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

2



### పాటల హక్కుల వివాదం.. ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు 134 సినిమాల పాటల యాజమాన్య హక్కులకు సంబంధించిన కాపీరైట్ వివాదంలో ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో గతంలో జారీ చేసిన మధ్యంతర నిషేధాజ్ఞను ఎత్తివేయాలని ఇళయరాజా దాఖలు చేసిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది.

2



2

### వెనెజువెలాలో భారత వైద్యుల సేవల్ని కొనియాడిన ప్రధాని మోదీ

ఢిల్లీ,
భూకంపంతో అతలాకుతలమైన వెనెజువెలాలో మానవతా దృక్పథంతో భారత్ చేపట్టిన 'ఆపరేషన్ అమిస్తాద్' లో అహర్నిశలు శ్రమిస్తున్న భారతీయ వైద్య బృందాలు, సైనిక వైద్యులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఇవాళ ప్రధాని 'శ' వేదికగా వైద్యులకు అభినందనలు తెలిపారు.సమాజం ఎదుర్కొనే ఎలాంటి సవాలునైనా అధిగమించడంలో వైద్య నిపుణులు ఎల్లప్పుడూ ముందుంటారనే దానికి వెనెజువెలాలో మన వైద్యులు చేస్తున్న సేవలే నిదర్శనమని ప్రధాని కొనియాడారు. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా దేశంలో వైద్య సేవల అభివృద్ధికి తీసుకుంటోన్న చర్యల్ని ఈ సందర్భంగా ప్రధాని వివరించారు.



4లో

# ఆదాయ సమీకరణపై దృష్టి సారించండి

## ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలి


## శాఖల వారీగా సామర్థ్యాన్ని పెంచుకోవాలి

## అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

ఆదాయ సమీకరణపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలని అన్నారు. హెచ్ఎండిఎ,టిజిఐఐసి, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలని సూచించారు. బుధవారం ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ఛేజింగ్ సెల్ నేర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా డిపార్ట్‌మెంట్స్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సీఎం సూచించారు.



### 'మీ పదవి మరికొన్ని నెలలు మాత్రమే'..



#### సీఎం రేవంత్‌పై బీజేపీ నేత ఘాటు వ్యాఖ్యలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను రేవంత్ ఎగతాళి చేయడంపై ఆ పార్టీ జాతీయ ప్రతినిధి ప్రేమ్ శుక్లా మండిపడ్డారు. 'మీ రోజులు దగ్గరపడ్డాయి' అంటూ హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌తో తెలంగాణను పోల్చడంపై తెలంగాణ సీఎంకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

2

### బండి భగీరథ్ పోక్సో కేసు.. బాధితురాలికి హైకోర్టు నోటీసులు

2



పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బండి భగీరథ్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. తనపై నమోదు చేసిన కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, ఎలాంటి తప్పూ చేయలేదని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తున్నానని భగీరథ్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు.అయితే బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే ముందు బాధితురాలి వాదన కూడా వినాల్సి ఉందని హైకోర్టు పేర్కొంది.

### అయోధ్య విరాళాల దుర్వినియోగం.. ఉద్యోగాల కోసం లంచం తీసుకున్నారా..

2



### ఓర్చుకోలేక బీజేపీ నేతలు మూర్ఖపు విమర్శలు చేస్తున్నారు

2



# రాష్ట్రవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ..

### 1.06 కోట్ల కుటుంబాలకు లబ్ధి!

### పౌరసరఫరాల శాఖ పకడ్బందీ ఏర్పాట్లతో పంపిణీ

### మొత్తం 3.41 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రయోజనం

### ముందుగానే చౌకధరల దుకాణాలకు

### 2.15 లక్షల టన్నుల బఫర్ స్టాక్

### నేరుగా తమకు కేటాయించిన బియ్యాన్ని పొందే అవకాశం

### గోదాముల సమస్యల పరిష్కారం-కేంద్రం సూచనలు

. హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

పౌరసరఫరాల శాఖ పకడ్బందీ ఏర్పాట్లతో ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 1.06 కోట్ల అర్హులైన పేద కుటుంబాలకు ఉచిత రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. దీని ద్వారా మొత్తం 3.41 కోట్ల మంది లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. జులై కోటా పంపిణీ నిమిత్తం పౌరసరఫరాల శాఖ సుమారు 2.15 లక్షల టన్నుల బియ్యాన్ని ఇప్పటికే సిద్ధం



చేసి, జిల్లాల వారీగా సరఫరాను పూర్తి చేసింది.

**ముందుగానే చౌకధరల దుకాణాలకు బఫర్ స్టాక్**

జులై నెలకు సంబంధించి లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పౌరసరఫరాల శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందుకోసం 2.15 లక్షల టన్నుల బఫర్ స్టాక్‌ను (అదనపు నిల్వలను) గడువు కంటే ముందే రాష్ట్రంలోని అన్ని చౌకధరల దుకాణాలకు (రేషన్ షాపులకు) విజయవంతంగా తరలించింది. దీనివల్ల నెల ప్రారంభంలోనే కార్డుదారులు ఎటువంటి నిరీక్షణ లేకుండా నేరుగా తమకు కేటాయించిన బియ్యాన్ని పొందే అవకాశం లభిస్తుంది.

**గోదాముల సమస్యల పరిష్కారం-కేంద్రం సూచనలు**

గతంలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల రాక నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ గోదాముల్లో నిల్వ సామర్థ్యం, స్థల లభ్యత సమస్య తీవ్రంగా మారింది. ఈ సమస్యను సమర్థవంతంగా అధిగమించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఒక కీలక సూచన చేసింది. ఒకేసారి మూడు నెలల కోటాను పంపిణీ చేయాలని సూచించడంతో, గత ఏప్రిల్-జూన్ మాసాలకు సంబంధించిన మూడు నెలల సన్నబియ్యాన్ని పౌరసరఫరాల శాఖ ఏప్రిల్ నెలలోనే లబ్ధిదారులకు ఏకకాలంలో పంపిణీ చేసింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన మొత్తం 6.43 లక్షల టన్నుల కోటాలో, దాదాపు 95 శాతం అనగా 6.08 లక్షల టన్నుల బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే లబ్ధిదారులకు విజయవంతంగా అందజేసి రికార్డు సృష్టించింది. తద్వారా గోదాములపై ఉన్న నిల్వల భారం తగ్గడమే కాకుండా, పేదలకు ముందస్తుగా రేషన్ అందింది.

## విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర.. ముగ్గురి అరెస్ట్..

ఇంటర్‌నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తమిళనాడులో అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. 15 మంది టీవీకే ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి, ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలతో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. టీవీకే ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తమిళనాడు ఇంటెలిజెన్స్ అధికారులు ఈ కుట్రపై దర్యాప్తు చేపట్టారు.

**ఎమ్మెల్యే ఫిర్యాదుతో కుట్ర వెలుగులోకి..**

టీవీకే పార్టీ ఎమ్మెల్యే ఎన్ ఇళయరాజా కొద్దిరోజుల క్రితం చెన్నై పోలీసులను ఆశ్రయించారు. చెన్నైకి చెందిన ఐపీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్ ఉద్యోగిపై ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో.. 'తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టమని ఐపీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్‌కు చెందిన వ్యక్తి నాతో చెప్పాడు. అలా చేస్తే 35 కోట్ల రూపాయలు ఇస్తానన్నాడు. ఈ ఆఫర్ గురించి ఎవరితోనూ మాట్లాడవద్దని చెప్పాడు' అని పేర్కొన్నాడు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో పోలీసులు ఐపీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్ ఉద్యోగిని అరెస్ట్ చేశారు. అతడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి అత్యంత సన్నిహితుడని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక, ఈ వ్యవహారంపై తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్ కుమార్ స్పందించారు. సెంథిల్ బాలాజీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. నిర్మల్ కుమార్ మాట్లాడుతూ.. 'సెంథిల్ బాలాజీతో సన్నిహిత సంబంధాలు ఉన్న వ్యక్తులు ఈ వ్యవహారంలో నేరుగా పాలుపంచుకున్నారు. వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కుట్రలో భాగం అయిన ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేయాలి. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు ముగింపు పలకాలి' అని అన్నారు.

## పాటల హక్కుల వివాదం.. ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు 134 సినిమాల పాటల యాజమాన్య హక్కులకు సంబంధించిన కాపీరైట్ వివాదంలో ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో గతంలో జారీ చేసిన మధ్యంతర నిషేధాజ్ఞను ఎత్తివేయాలని ఇళయరాజా దాఖలు చేసిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో ప్రస్తుతం అమల్లో ఉన్న మధ్యంతర ఉత్తర్వులు యథాతథంగా కొనసాగనున్నాయి. ఈ వివాదంలో ప్రముఖ సంగీత సంస్థ సారేగామా (ఋతీవస్త్రుుఋ) 134 చిత్రాల్లోని పాటలపై తమకే కాపీరైట్ హక్కులు ఉన్నాయని కోర్టుకు తెలిపింది. మరోవైపు, తాను స్వరపరిచిన పాటలపై తనకూ హక్కులు ఉన్నాయని ఇళయరాజా వాదిస్తున్నారు. ఈ అంశంపై ఇరు పక్షాల మధ్య న్యాయపోరాటం కొనసాగుతోంది.మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలన్న ఇళయరాజా అభ్యర్థనను పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వాటిని ఎత్తివేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ కాపీరైట్ వివాదంపై తుది విచారణ పూర్తై.. తుది తీర్పు వెలువడే వరకూ ప్రస్తుతం అమల్లో ఉన్న మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని ఢిల్లీ హైకోర్టు వెల్లడించింది. ఈ కేసు తుది తీర్పు సంగీత పరిశ్రమలో కాపీరైట్ హక్కుల విషయంలో కీలక ప్రభావం చూపే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

## 'మీ పదవి మరికొన్ని నెలలు మాత్రమే'..

### సీఎం రేవంత్‌పై బీజేపీ నేత ఘాటు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను రేవంత్ ఎగతాళి చేయడంపై ఆ పార్టీ జాతీయ ప్రతినిధి ప్రేమ్ శుక్లా మండిపడ్డారు. 'మీ రోజులు దగ్గరపడ్డాయి' అంటూ హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌తో తెలంగాణను పోల్చడంపై తెలంగాణ సీఎంకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ నేతల అహంకారం, చంచల రాజకీయం త్వరలోనే కుప్పకూలుతుందని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాజయం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి అహంకారానికి త్వరలోనే తెరపడనుందన్నారు. గతంలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే ఇప్పుడు కాంగ్రెస్‌కు పడుతుందని ప్రేమ్ శుక్లా హెచ్చరించారు. 'రేవంత్ రెడ్డి.. కళ్లు తెరిచి చూడండి.. 22 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ. 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయం. రేవంత్ రెడ్డి పదవి మరికొన్ని నెలలు మాత్రమే.. మీ రోజులు దగ్గరపడ్డాయి' అంటూ బీజేపీ నేత ప్రేమ్ శుక్లా ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## అయోధ్య విరాళాల దుర్వినియోగం.. ఉద్యోగాల కోసం లంచం తీసుకున్నారా..

అయోధ్యలోని రామ మందిర విరాళాల దుర్వినియోగంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ అంశంపై ప్రస్తుతం సమగ్ర విచారణ జరుగుతోంది. ఈ కేసులో మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా పాత్రపై ప్రత్యేక దర్యాప్తు బృందం (ూ×ు) దృష్టి సారించింది. ఇప్పటికే అరెస్టైన నిందితులను విచారించగా అనిల్ మిశ్రా పేరు పలుమార్లు ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. గత వారం ఆయన ట్రస్టీ పదవికి రాజీనామా చేశారు దర్యాప్తులో వెలుగుచూసిన వివరాల ప్రకారం.. రామ మందిరంలో పనిచేస్తున్న కనీసం 125 మంది ఉద్యోగులు అనిల్ మిశ్రా (ూఅఅశ్రీ వీఅంష్త్రఙఖు) సిఫార్సుతోనే నియమితులయ్యారని అధికారులు అనుమానిస్తున్నారు. ఉద్యోగాల కోసం అనిల్ మిశ్రా లంచాలు కూడా తీసుకున్నారనే ఆరోపణలపై సిట్ విచారణ కొనసాగిస్తోంది. అంతేకాకుండా, ట్రస్టీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఆస్తులు ఎంత మేర పెరిగాయనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.ఈ కేసులో అరెస్టైన ఎనిమిది మంది నిందితుల్లో అనుకల్ప్ మిశ్రా, లవ్ కుశ్ మిశ్రా ఉన్నారు. నిధులు కాజేయడంలో వీరి పాత్ర కూడా కీలకమైనదని, వీరిద్దరూ అనిల్ మిశ్రా బంధువులని అధికారులు భావిస్తున్నారు. కాగా, నిందితులు సీసీటీవీ కెమెరాలకు చిక్కకుండా ప్రత్యేక పద్ధతిని అనుసరించి నిధులను కాజేసినట్టు విచారణలో బయటపడింది.ఒక వ్యక్తి నగదును తీసుకెళ్లే సమయంలో మిగిలినవారు అతడి చుట్టూ కెమెరాకు అడ్డుగా నిలబడేవారని అధికారులు తెలిపారు. నగదును సమీపంలోని బాత్‌రూమ్‌లో దాచిపెట్టి, అవకాశం దొరికినప్పుడల్లా బయటకు తీసుకెళ్లేవారని వెల్లడైంది. ట్రస్టు అధికారులతో సన్నిహిత సంబంధాలు ఉండటంతో వారిని ఎవరూ తనిఖీ చేయలేదని కూడా దర్యాప్తులో తేలింది.ఇక, కౌంటింగ్ రూమ్‌కు చెందిన ఒక తాళం చెవి నిందితులలో ఒకడైన టిన్నూ యాదవ్ దగ్గరా, మరొకటి బ్యాంకు సిబ్బంది దగ్గర ఉండేది. నాలుగు విరాళాల పెట్టెలలో జమ చేసిన నగదును, 11 మంది బ్యాంకు సిబ్బంది, ఆలయ ట్రస్ట్ నుంచి మరో ముగ్గురితో సహా మొత్తం 14 మంది సభ్యుల బృందం లెక్కించేది. వీరందరి పాత్రపై ప్రస్తుతం సిట్ దర్యాప్తు సాగిస్తోంది.ఆలయంలో భద్రతా నిబంధనలు పాటించకపోవడం, సీసీటీవీ ఫుటేజీని నిర్ణీత కాలం పాటు భద్రపరచకపోవడంతో పాటు విరాళాల లెక్కింపు ప్రక్రియలో కూడా అనేక లోపాలు ఉన్నట్లు సిట్ గుర్తించింది. దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మరికొందరిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం

## బండి భగీరథ్ పోక్సో కేసు.. బాధితురాలికి హైకోర్టు నోటీసులు

### బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ

### బాధితురాలి వాదన వినేందుకు ఆమెకు నోటీసులు జారీ

### కేసు విచారణను ఎల్లుండికి వాయిదా వేసిన హైకోర్టు

### ప్రస్తుతం చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్

అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బండి భగీరథ్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. తనపై నమోదు చేసిన కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, ఎలాంటి తప్పు చేయలేదని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తున్నానని భగీరథ్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు.అయితే బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే ముందు బాధితురాలి వాదన కూడా వినాల్సి ఉందని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని బాధితురాలికి నోటీసులు జారీ చేసింది. అనంతరం కేసు తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది.మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో బండి భగీరథ్‌పై మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. అనంతరం పరారైన అతణ్ని మే 16న పోలీసులు అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు తరలించారు.ఇంజినీరింగ్ పరీక్షలు రాసేందుకు వీలుగా ఈ నెల 20 నుంచి 24 వరకు మధ్యంతర బెయిల్ మంజూరైంది. గడువు ముగియడంతో గత వారం మళ్లీ చర్లపల్లి జైలుకు తరలించారు. ప్రస్తుతం రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు ఎల్లుండి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## ఓర్చుకోలేక బీజేపీ నేతలు మూర్ఖపు విమర్శలు చేస్తున్నారు: మల్లు రవి

### తెలంగాణలో రాముడి ఆదర్శ పాలన సాగుతోందన్న మల్లు రవి

### అయోధ్య రాముడి సొమ్మును బీజేపీ దిగమింగిందని ఆరోపణ

### రాహుల్ ప్రధాని కావడం ఖాయమని ధీమా

న్యూఢిల్లీ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణలో సాగుతోంది రాముడి ఆదర్శ పాలన అని ఆ పార్టీ సీనియర్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. దేవుడి సొమ్మును కూడా దిగమింగిన బీజేపీకి ఇక పుట్టగతులుండవు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సర్వజన సంక్షేమమే ధ్యేయంగా దూసుకుపోతుంటే, ఓర్వలేక బీజేపీ నేతలు మూర్ఖపు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.తెలంగాణలో ఉనికి కోసం ఆరాటపడుతున్న బీజేపీ... దేశంలో అత్యంత అవినీతి, నియంతృత్వ ధోరణులతో ఒక 'రావణాసుర పాలన' సాగిస్తోందని మల్లు రవి ధ్వజమెత్తారు. ఇటీవల తెలంగాణలో పర్యటించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటన ఒక 'అట్టర్ ఫ్లాప్ షో' అని ఎద్దేవా చేశారు. ఇక్కడ కాంగ్రెస్‌ను గద్దె దించడం ఎవరి వల్లా కాదని, తెలంగాణ సమాజం మత విద్వేష రాజకీయాలను ఎన్నటికీ ఆదరించదని స్పష్టం చేశారు.అయోధ్య రాముడి పేరుతో 40 ఏళ్లుగా రాజకీయం చేస్తున్న బీజేపీ... చివరకు ఆ దేవుడి సొమ్మును కూడా వదలకుండా మింగేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. స్వయంగా యూపీలోని అయోధ్య వాసులే ఆ పార్టీ అవినీతిపై ఆగ్రహంతో ఉన్నారని, దేశంలో కమలం పార్టీకి కాలం చెల్లిందన్నారు. విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీకి రాబోయే సార్వత్రిక ఎన్నికలే చివరివని, త్వరలోనే దేశం 'బీజేపీ ముక్త్ భారత్' కాబోతుందని జోస్యం చెప్పారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీయడం, రాహుల్ గాంధీ ప్రధాని పీఠాన్ని అధిరోహించడం ఖాయమని మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు.

## వెనెజువెలాలో ఏం జరిగింది?..

### కీలక అవయవాలు లేకుండా తిరిగొచ్చిన భారత నావికుడి మృతదేహం!

### వెనెజువెలాలో మరణించిన భారత నావికుడు రాకేశ్ చౌహాన్


### గుండె, ఊపిరితిత్తులు, మెదడు సహా కీలక అంతర్గత అవయవాలు లేవని పోస్టుమార్టంలో వెల్లడి

### ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, కంపెనీపై చర్యలు తీసుకోవాలని కుటుంబం డిమాండ్

### ఇది ఆమోదయోగ్యం కాదంటూ భారత నావికుల సంఘాల సమాఖ్య తీవ్ర ఆగ్రహం

### కంపెనీ గానీ, వెనెజువెలా అధికారులు గానీ ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వని వైనం

విదేశంలో ఉద్యోగం చేస్తూ మరణించిన తమ కుమారుడి మృతదేహాన్ని చూసి ఆ కుటుంబం కకావికలమైంది. దేహంలో కీలకమైన అంతర్గత అవయవాలు ఏవీ లేకుండా ఖాళీగా అప్పగించడంతో వారు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ అమానవీయ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం ప్రభుత్వాన్ని కోరుతోంది. ఉత్తరప్రదేశ్‌లోని దేవరియా జిల్లాకు చెందిన రాకేశ్ చౌహాన్ (33) కథ ఇది.వివరాల్లోకి వెళితే... దేవరియా జిల్లా, లగ్గా బజార్ టోలాకు చెందిన రాకేశ్ చౌహాన్.. వెనెజువెలాలో 'ఎక్స్‌ఫినిటీ' అనే కంపెనీకి చెందిన మర్చంట్ నౌకలో నావికుడిగా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది మే నెలలో ఓడలో కిందపడి గాయపడ్డాడని, తర్వాత గుండెపోటుతో మరణించాడని కంపెనీ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. దాదాపు నెల రోజుల తర్వాత జూన్ 4న రాకేశ్ మృతదేహం స్వగ్రామానికి చేరింది. అయితే, మృతదేహంపై ఉన్న కుట్లు చూసి కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది.దీంతో జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు దేవరియాలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఆ నివేదికలో షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. రాకేశ్ శరీరం నుంచి మెదడు, గుండె, రెండు ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలు, ప్లీహం, క్లోమం, కడుపు, ప్రేగులతో పాటు దాదాపు అన్ని ప్రధాన అంతర్గత అవయవాలను తొలగించినట్లు వైద్యులు నిర్ధారించారు. మెడ నుంచి కింద వరకు 22 కుట్లు, ఒక చెవి నుంచి మరో చెవి వరకు 21 కుట్లు ఉన్నాయని, శరీరాన్ని డీప్ ఫ్రీజ్‌లో ఉంచారని తెలిపారు. కీలక అవయవాలు లేకపోవడంతో మరణానికి కచ్చితమైన కారణాన్ని నిర్ధారించలేమని వైద్యులు స్పష్టం చేశారు.ఈ ఘటనపై ఫెడరేషన్ ఆఫ్ సీఫేరర్స్ యూనియన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్‌యూఐ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. నావికులు బలిపశువులు అవుతున్నారు" అని పేర్కొంది. వెనెజువెలాలోని భారత రాయబార కార్యాలయం జోక్యం చేసుకుని, పూర్తి ఆటోప్సీ నివేదికను తెప్పించాలని, మరణానికి గల కారణాలను వెలికితీయాలని, బాధిత కుటుంబానికి న్యాయం, నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేసింది."మమ్మల్ని పూర్తిగా చీకట్లో ఉంచారు. నా కొడుకు మరణంపై కంపెనీపై చర్యలు తీసుకుని, ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి" అని రాకేశ్ తండ్రి రామ్ దేవ్ చౌహాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణమైన ఆరోపణలపై వెనెజువెలా అధికారులు గానీ, షిప్పింగ్ కంపెనీ గానీ ఇప్పటివరకు స్పందించకపోవడం గమనార్హం. ఈ ఘటన విదేశాల్లో పనిచేస్తున్న భారత నావికుల భద్రతపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది.



అరుణ్ సమాచారమ్

# రైతు ఉద్యమాలకు దిశా నిర్దేశం

### -జులై 3,4,5 తేదీల్లో ఏలూరు వేదికగా రైతు మహాసభలు

### వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అవసరం

### -నష్టపోతున్న అన్ని పంటల రైతులను ఆదుకోవాలి

### - రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి

**ఏలూరు,**

రాష్ట్ర రైతుల ఉద్యమాలకు జులై 3,4,5 తేదీల్లో ఏలూరులో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు దిశా నిర్దేశం చేయనున్నాయని, ఈ మహాసభ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఏలూరులోని అల్లూరు సత్యనారాయణ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జులై 3న మధ్యాహ్నం గంటలకు జూట్ మిల్ సెంటర్ నుండి హలో రైతన్న - చలో ఏలూరు పేరుతో రైతు మహా ప్రదర్శన, మధ్యాహ్నం 3 గంటలకు ఇండోర్ స్టేడియం గ్రౌండ్ లో బహిరంగ సభ జరుగుతుందని, 4,5 తేదీల్లో డీసీఎంఎస్ ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ జరుగుతుందని వివరించారు. ముఖ్య అతిథులుగా అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు అశోక్ ధావలే, జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, జాతీయ సహాయ కార్యదర్శి టి.సాగర్, రైతు సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని రైతాంగ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నామన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి బాగాలేదని, ఏ పంటకు కనీస ధర రావడం లేదన్నారు. మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, మామిడికి తగిన ధర రాలేదని, పొగాకు రైతులకు పొగ పెడుతున్నారని విమర్శించారు. ఆక్వా రైతులు




తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, రో÷-లడెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితిని ప్రభుత్వాలు కల్పించాయన్నారు. భారీగా పెంచిన ఆక్వా మేతల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. వర్జీనియా పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించాలని కోరారు. పొగాకు కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కోకో రైతులకు తగిన ధర రాలేదని, కోకో గింజలకు ప్రైస్ పాలసీ ప్రకటించాలన్నారు.ఆయిల్ పామ్ రైతులను ఆయిల్ రికవరీ శాతం పేరుతో కంపెనీల దోపిడీ ఆపాలన్నారు. అమెరికాతో భారత్ జులై మొదటి వారంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయనున్నట్లు ప్రకటించారని, ఈ ఒప్పందం వలన మన దేశ వ్యవసారంగం తీవ్రంగా దెబ్బతింటుందని, రైతులు నష్టపోతారని ఆందోళన చేశారు. పాలు,పాల పదార్థాలు ఎటువంటి సుంకాలు లేకుండా దిగుమతి అవుతాయని, పాడి పరిశ్రమ,పాడి రైతులు దివాళా తీస్తారని చెప్పారు. మొక్కజొన్న,సోయాబీన్,పత్తి ఇతర వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అయితే ఇప్పటికే నష్టపోతున్న ఆయా పంటల రైతులు మరింత నష్టపోతారని అన్నారు. అమెరికాతో స్వేచ్ఛా ఒప్పందాన్ని అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయంలో స్థితిగతులు చర్చించి భవిష్యత్ రైతు ఉద్యమాలకు దిశా నిర్దేశర చేయనున్న రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని అందుకు అందరూ సహకరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు బి. బలరాం మాట్లాడుతూ రైతు రక్షణ,వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయంలో కీలకపాత్ర వహిస్తున్న కౌలు రైతుల పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని విమర్శించారు. కౌలు రైతుల రక్షణ కోసం నూతన చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం నాయకులు ఆర్.లింగరాజు, ఎం. నాగమణి, పి.రామకృష్ణ, డి.ఎన్.వి.డి ప్రసాద్, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా ఎపి టాప్

**అమరావతి,**

డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడంలో విశేషంగా కృషి చేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో మహిళలకు వ్యక్తిగత ఎంటర్‌ప్రైజ్ రుణాల అమల్లో 99.7 శాతం లక్ష్యాన్ని సాధించింది.రూ.1,500 కోట్ల రుణ లక్ష్యానికి గాను రూ.1,495.50 కోట్ల రుణాలను మహిళా పారిశ్రామిక వేత్తలకు పంపిణీ చేసింది. 1.50 లక్షల మంది మహిళలకు రుణాల అందించాలని లక్ష్యం పెట్టుకోగా, 1,47,840 మందికి వ్యక్తిగత పారిశ్రామిక రుణాలు అందించింది. ఎపీతో సమానంగా లక్ష్యాలను నిర్దేశించు కుని... టార్గెటులో కేవలం 15, 25 శాతం మాత్రమే బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు చేరుకున్నాయి. మహిళా పారిశ్రామిక వేత్తలకు ఎపి ప్రభుత్వం రుణాలు అందించడంలో అద్భుత పనితీరు కనబరుస్తుండడంతో 2026-27 ఏడాదికి ఏపీకి 1.67 లక్షల మంది మహిళలకు రూ. 1670 కోట్లు రుణాలు అందించాలని టార్గెట్‌గా పెట్టుకుంది. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకంలోనూ దేశంలో అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. మహిళల ఆర్థిక సాధికారతలో ఆంధప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని కేంద్ర నివేదికలు చెబుతున్నాయి. 2025-26లో 35,934 మంది లబ్దిదారులకు ప్రయోజనం కల్పించిన రాష్ట్రం. 2025-26 ఏడాదిలో నిర్దేశించుకున్న లక్ష్యంలో 95 శాతం సాధించింది. రుణాల పంపిణీతోపాటు గ్రామీణ మహిళలకు స్థిరమైన ఉపాధి కల్పించడంలోనూ ముందంజలో ఉంది. వ్యాపార నిర్వహణ, ఫైనాన్షియల్-డిజిటల్ లిటరసీ, నైపుణ్యాభివృద్ధిపై డ్వాక్రా మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించచింది. అలాగే డిజిటల్ మానిటరింగ్, ఎంఐఎస్ వ్యవస్థ, ఫీల్డ్ తనిఖీలతో మహిళా పారిశ్రామిక వేత్తలకు రుణాల మంజూరు చేయించే అంశంపై కూటమి ప్రభుత్వ నిరంతర పర్యవేక్షణ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వేగంగా రుణాలు మంజూరు చేసి మహిళలకు తోడ్పాటు అందించాయి బ్యాంకులు. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ లోకల్ లక్ష్యాల సాధనలో ఆంధప్రదేశ్ ముందంజలో ఉండగా గ్రామీణ పారిశ్రామికీకరణ, మహిళా సాధికారత, ఉపాధి కల్పన, కుటుంబ ఆదాయాల పెంపులో ఏపీ ఆదర్శంగా నిలిచింది. పేద, వెనుకబడిన వర్గాల మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో జాతీయ స్థాయిలో ఛాంపియన్ గా నిలిచింది ఆంధ్రప్రదేశ్.

## తెలంగాణపై విషం చిమ్మిన చౌహాన్

### ఎపిని పొగుడుతూ..తెలంగాణపై అక్కసు

**న్యూఢిల్లీ,**

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఓ రకంగా విషం కక్కారు. ఇటీవల కేంద్ర మంత్రులు అడపాదడపా విషం కక్కుతూనే ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి మన రాష్ట్రానికే చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులకు పెద్దగా పట్టింపు లేదు. ఏదైనా పని కావాలని పట్టుబట్టి చేయించడం లేదు. ఈ క్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖళ మంత్రుల సమావేశంలో శివరాజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు. అంతేగాకుండా ఆంధ్రా మత్రాం భేషుగ్గా పనిచేస్తోందని స్తుతించారు. చంద్రబాబు దయాదాక్షిణ్యాలతో మోడీ సర్కార్ నడుస్తోంది. అందుకే ఈ మధ్య బాబును పొగడం కేంద్రమంత్రులు బాగా అలవాటు చేసుకున్నారు. పనులు గట్టెక్కించుకునే క్రమంలో చంద్రబాబు కూడా మోడీని ఆకాశానికి ఎత్తుతున్నారు. కానీ మధ్యలో తెలంగాణలో తెగడాల్సిన పనిలేదు. కానీ ఇప్పుడు జరుగుతున్నది అదే. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఇందులో తెలంగాణ గ్రామీణాభివృద్ది శాఖ మంత్రి సీతక్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఏసీవై రహదారుల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి మంత్రితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు. పనిలో పనిగా గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్‌ఎంఏజీఐ నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్‌ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. జాతీయ ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ వివరించారు. ఇదంతా కేవలం కావాలని చేస్తున్న ప్రకటనగానే చూడాలి. తెలంగాణపై విషం కక్కేందుకు ఎలాంటి అవకాశాన్ని కూడా కేంద్రం వదులుకోవడం లేదు. ఇక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉన్నది పక్కన పెడితే కనీసం అభివృద్ధికి కేంద్రం తోడ్పాటు ఇవ్వడం లేదు. అభివృద్ధి ఆగిపోతే అది ప్రజలకే నష్టం అన్న జ్ఞానం ఇక్కడ ఉన్న ఇద్దరు మంత్రులకు కలగడం లేదు. బాబును పొగడడం కోసం ఎంతకైనా తెగిస్తారనడానికి ఇదే నిదర్శనం.

## అరుణాచల్‌లో చైనా చొరబాట్లు

### మీడియా కథనాలను తోసిపుచ్చిన ఆర్మీ

**న్యూఢిల్లీ,**

చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం కావడంతో, వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారమని వెల్లడించింది. మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్ లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి పత్రాన్ని సమర్పించింది. భారత్-చైనా సరిహద్దు సమీపంలో పీఎల్‌ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10- 15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా



విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది. ఇటీవల బీజింగ్‌లో భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మీడియా కథనాలు రావడం గమనార్హం.

## ఖనిజ నిల్వలపై మినరల్ మ్యాపింగ్

### ఖనిజాలకు విలువ జోడింపుపై ప్రత్యేక దృష్టి


### మినరల్ వెల్త్ మార్కెట్ క్యాపిటలైజేషన్‌పై అధ్యయనం

### టెక్నాలజీ వినియోగంతో ఉచిత ఇసుక తవ్వకాల పర్యవేక్షణ

### గనుల శాఖపై సమీక్ష లో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి,**

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విలువైన ఖనిజ నిల్వల్ని గుర్తించేలా మినరల్ మ్యాపింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. క్రిటికల్ మినరల్స్, బల్క్ మినరల్స్‌తో పాటు విలువైన లోహాలు లభ్యం అయ్యే ప్రాంతాల మ్యాపింగ్ జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వెలికి తీసే ఖనిజాలకు విలువ జోడించేలా ప్రాసెసింగ్ పక్రియను నిర్వహించే అంశంపైనా దృష్టి సారించాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఖనిజ సంపదకు సంబంధించి మార్కెట్ క్యాపిటలైజేషన్ కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎండీసీ ద్వారా విలువైన ఖనిజాల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు అవకాశం ఉందన్నారు. దీనిపై నిపుణులతో కలిసి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా లాంటి వివిధ ఖనిజాలకు విలువ జోడింపు పక్రియ ద్వారా గరిష్ఠంగా రెవెన్యూను ఆర్జించేందుకు ఆస్కారం ఉందని సీఎం అన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఖనిజ ఆదాయం కారణంగానే రెవెన్యూ మిగులు సాధించాయని సీఎం వ్యాఖ్యానించారు. ఖనిజాల వ్యాల్యూ అడిషన్ కు సంబంధించి విస్తృతంగా చర్చించి ఓ ప్రత్యేక విధానం తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. రాష్ట్రంలోనే ఈ ఖనిజాల విలువ జోడింపు పక్రియ జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీ, ఒడిశా, కేరళ లాంటి రాష్ట్రాల్లో లభ్యమయ్యే అత్యంత విలువైన రేర్ ఎర్త్ మినరల్స్‌పై క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. టైటానియం, ఇలమనైట్, మోనజైట్ లాంటి హై వాల్యూ మినరల్స్ నిల్వలు ఏమేరకు ఉన్నాయన్న దానిని గుర్తించాలన్నారు. ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్ సహా విలువైన లోహాలను తయారు చేసేందుకు రేర్ ఎర్త్ మినరల్స్ వెలికితీత జరగాలన్నారు. ప్రత్యేకమైన పరికరాల తయారీకి కీలకమైన ఈ లోహాలు అణు ఇంధనం సహా వ్యూహాత్మకంగా దేశానికి కూడా అత్యంత కీలకమని సీఎం అన్నారు. రాష్ట్రంలో జొన్నగిరి సహా చిత్తూరు జిల్లా చిగురుగుంట వద్ద కూడా బంగారం నిల్వలు ఉన్నాయని మిగతా బ్లాక్స్ పై కూడా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి గనుల శాఖకు సూచనలిచ్చారు. రాష్ట్రంలోని 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్ ఖనిజాలు సహా ఇతర విలువైన ఖనిజాలను గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం మైనింగ్ ఆపరేషన్స్ ద్వారా రెవెన్యూలో 18 శాతం మేర వృద్ధి నమోదైనట్టు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం గనుల తవ్వకాలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఖనిజ సంపద ద్వారా రాష్ట్రానికి గరిష్ట ఆదాయం వచ్చేలా చూడాలని సూచించారు. ఇసుక తవ్వకాల, సరఫరా పై



కూడా పూర్తి స్థాయి నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇసుక రీచ్ ల వద్ద సీసీ కెమెరాలతో పాటు శాటిలైట్ చిత్రాల ద్వారా విశ్లేషించటంతో పాటు వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల కోసమే ఇసుకపై వెయ్యి కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని వదిలేసి ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సీఎస్ సాయి ప్రసాద్, గనుల శాఖ, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా, పీయుష్ కుమార్ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మహా సిఎం ఫడ్నవీస్‌తో పవన్ భేటీ

### తూర్పు కనుమలలో పులుల సంరక్షణపై చర్చ

### రెండు ఆడపులులలను ఇచ్చేందుకు సిఎం అంగీకారం

**ముంబయి,**

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై నేతలు చర్చించారు. ముంబయిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి రెండు ఆడ పులులు ఇచ్చే అంశాలపై చర్చలు సాగాయి. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించి భవిష్యత్తులో మరింత సహకరించుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు తలెత్తాయన్నారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడ పులులు ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని.. ఈ సహకారానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఏపీలోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడపులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు వచ్చాయని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆంధప్రదేశ్‌కు రెండు ఆడపులులను ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు.

## ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాల విడుదల వాయిదా

**అమరావతి,**

ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాల విడుదలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. సీబీఎస్సీ 12వ తరగతి ఫలితాలు పూర్తిస్థాయిలో రానందున, విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 1న ఫలితాలను విడుదల చేయాల్సి ఉండగా, ఇంటర్మీడియట్ మార్కులకు 25 శాతం వెయిటేజ్ ఉండటంతో ఏ ఒక్క విద్యార్థికీ నష్టం జరగకుండా జాగ్రత్త పడాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీబీఎస్సీ రివైజ్డ్ ఫలితాలు, అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వచ్చిన అనంతరం ఈఏపీసెట్ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఏడాది మే 12 నుంచి 20 వరకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.29 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. తాజా నిర్ణయం ప్రకారం జులై 2 వరకు ఈఏపీసెట్ ఫలితాల విడుదల వాయిదా పడింది.

## మామిడిరైతులు ఆందోళన చెందవద్దు

**అమరావతి,**

మామిడి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. వారికి అండగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఏడాది కూడా కూటమి ప్రభుత్వం రైతులకు కేజీకి రూ.4 చెల్లించి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా కేజీకి రూ.4 ముందస్తు చెల్లించి మామిడి కొనుగోళ్లు కొనసాగిస్తున్నామని తెలిపారు. పంట దిగుబడి అధికంగా రావడంతో తాత్కాలికంగా కొనుగోళ్లపై ఒత్తిడి ఏర్పడిందని చెప్పారు. గత ఏడాది మామిడి రైతులకు సుమారు రూ.190 కోట్లు చెల్లించి ప్రభుత్వం ఆదుకుందన్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. కొనుగోళ్లలో జాప్యం జరిగితే సంబంధిత ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన వైసీపీ సానుభూతి కంపెనీలు కొనుగోళ్లలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించమన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రైతులను వైసీపీ.. రాజకీయాలకు వాడుకోవడం మానుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు.

PRGI NO: TGTEL/25/A5314

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

## సంపాదకీయం...

# వైద్యశాస్త్ర పితామహుడు సుశ్రుతుడు

ప్రతి సంవత్సరం జులై 1న మనం 'జాతీయ వైద్యుల దినోత్సవం' జరుపుకుంటాం. ఈ రోజు కేవలం వైద్యులకు కృతజ్ఞతలు తెలుపుకోవడమే కాదు, మానవ ఆరోగ్యంకోసం వారుపడుతున్న శ్రమను గుర్తించే అపురూపమైన సందర్భం. ఆధునిక వైద్యశాస్త్రం నేడు సాంకేతికతతో ఎంతగానో అభివృద్ధి చెందినప్పటికీ శస్త్రచికిత్స అంటే సర్జరీ రంగంలో వేల ఏళ్ల క్రితమే అత్యున్నత ప్రమాణాలతో పునాదులు వేసిన మేధావి, మహర్షి సుశ్రుతుడు. ప్రాచీనకాలంలోనే కత్తిని పట్టుకుని అద్భుతమైన శస్త్రచికిత్సలను నిర్వహించి, మానవ శరీర నిర్మాణాన్ని శాస్త్రీయంగా ఆవిష్కరించిన ఆయనను, నేడు ప్రపంచం ఏకగ్రీవంగా 'ప్లాస్టిక్ సర్జరీ పితామహుడు' (ఫాదర్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జరీ)గా గౌరవిస్తోంది. ఆధునిక వైద్య ప్రపంచానికి దిక్సూచిలా నిలిచిన ఆ మహనీయుని వైజ్ఞానిక వారసత్వం, నాటి నుంచి నేటి వరకు వైద్య రంగానికి నిరంతర స్ఫూర్తినిస్తూనే ఉంది. ఈ వైద్యరంగ పితామహుడు సుశ్రుత మహర్షిఎప్పుడు పుట్టారు అనే దానిపై చారిత్రక ఆధారాల ప్రకారం ఆయన క్రీస్తుపూర్వం 6వ శతాబ్దం (సుమారు 600 బిసి) కాలానికి చెందిన వారని భావిస్తారు. ఆయన వారణాసి పుట్టారు. సుశ్రుతుడు కాశీ రాజు అయిన దివోదాసు ధన్వంతరి దగ్గర విద్యాబోధనను కొనసాగించారని 'సుశ్రుత సంహిత' ద్వారా తెలుస్తుంది. దివోదాసు ధన్వంతరి శిష్యునిగా వైద్య విద్యను అభ్యసించారు. చాశ్రీంశీ =ఘుఃన – ఎల్‌నినోను ఎదుర్కోవడమెలా? సుశ్రుతుడు రచించిన 'సుశ్రుత సంహిత' ప్రాచీన భారతీయ వైద్యశాస్త్రంలో ఒక అద్భుతం. ఇందులో శస్త్రచికిత్సకు సంబంధించిన పద్ధతులు, శరీర నిర్మాణం, వ్యాధి నిర్ధారణ, చికిత్స గురించి చాలా స్పష్టంగా వివరించబడ్డాయి. ఇది కేవలం ఒక గ్రంథం కాదు, అప్పటి కాలపు వైద్యుల కోసం రూపొందించిన సమగ్ర మార్గదర్శిని. ప్లాస్టిక్ సర్జరీతో వీరు అద్భుతమైన ఆవిష్కరణలు చేశారు. సుశ్రుతుడిని 'ప్లాస్టిక్ సర్జరీ పితామహుడు' అని పిలవడానికి ప్రధాన కారణం ఆయన ఆ కాలంలోనే చేసిన 'రైనోప్లాస్టీ' అంటే ముక్కు పునర్నిర్మాణం అద్భుతంగా చేశారు. శిక్షా స్మృతిలో భాగంగా ముక్కు కోయబడిన వ్యక్తులకు, సుశ్రుతుడు రోగి బుగ్గనుండి చర్మాన్ని సేకరించి, దానిని ముక్కు ఆకారంలో మలిచి అమర్చేవారు. దీని కోసం ఆయన ఉపయోగించిన పరిజ్ఞానం నేటి ఆధునిక ప్లాస్టిక్ సర్జరీకి ప్రాథమిక పునాది. ఇది కేవలం సౌందర్యం కోసమే కాకుండా, ప్రమాదాలు లేదా శిక్షల వల్ల దెబ్బతిన్న అవయవాలను పునర్నిర్మించి, మనిషికి గౌరవప్రదమైన జీవనాన్ని ప్రసాదించడం ఆయన లక్ష్యం. సుశ్రుతుడు కేవలం ప్లాస్టిక్ సర్జరీకే పరిమితం కాలేదు. ఆయన మరికొన్ని విప్లవాత్మక శస్త్రచికిత్సలు కూడా చేశారు. సుశ్రుత మహర్షిశస్త్రచికిత్స రంగంలో చేసిన అద్భుతాలు కేవలం కొన్ని పద్ధతులకే పరిమితం కాలేదు. ఆధునిక వైద్యశాస్త్రం కనుగొన్న అనేక పద్ధతులను వేల ఏళ్ల క్రితమే సుశ్రుతుడు తన 'సుశ్రుత సంహిత'లో వివరించారు. ముందుగా కంటిశుక్లాల తొలగింపు – సుశ్రుతుడు కంటి శుక్లాన్ని తొలగించడానికి 'జలౌక', 'శలాక' పరికరాలను ఉపయోగించేవారు. కంటిలోని మసకబారిన శుక్లాన్ని 'శలాక' అనే ప్రత్యేక పరికరంతో నెమ్మదిగా కంటి లోపలికి నెట్టి, చూపును తిరిగి వచ్చేలా చేసేవారు. ఆ కాలంలోనే ఇన్ఫెక్షన్ రాకుండా కంటిని శుభ్రం చేయడానికి ప్రత్యేకమైన మూలికల రసాలను, కట్టుకట్టే పద్ధతులను ఆయన వివరించారు. దీనినే అప్పట్లో 'కోచింగ్' అని పిలిచేవారు. మోదమా.. ఖేదమా? శస్త్రచికిత్స తర్వాత రోగి కంటికి పట్టీవేసి, కొంతకాలం విశ్రాంతి తీసుకోమని సూచించేవారు. ప్రసూతి శాస్త్రంలో కూడా వీరు అందవేసిన చేయి. సుశ్రుతుడు ప్రసూతి వైద్యంలో అత్యున్నత ప్రమాణాలు పాటించేవారు. ప్రసవ సమయంలో శిశువు సరైన స్థితిలో లేనప్పుడు సుశ్రుతుడు తన నైపుణ్యంతో శిశువును బయట నుండే చేతులతో సున్నితంగా తిప్పి సాధారణ ప్రసవానికి వీలు కల్పించేవారు. ఒకవేళ సాధారణ ప్రసవం అసాధ్యమని తెలిసినప్పుడు, అత్యంత జాగ్రత్తగా శస్త్రచికిత్స చేసి తల్లిని, బిడ్డను రక్షించే పద్ధతులను ఆయన సంహితలో పేర్కొన్నారు. మరో వైద్యుడి పర్యవేక్షణలో అనుభవజ్ఞులైన నర్సుల సహాయంతో ఈ ప్రక్రియలు జరిపేవారు.

# ఆదాయ సమీకరణపై దృష్టి సారించండి

## ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలి

## శాఖల వారీగా సామర్థ్యాన్ని పెంచుకోవాలి

## అధికారులకు సిఎం రేవంత్ దిశానిర్దేశం

హైదరాబాద్,

ఆదాయ సమీకరణపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలని అన్నారు. హెచ్‌ఎండిఎ,టిజిఐఐసి, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలని సూచించారు. బుధవారం ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ఛేజింగ్ సెల్ నేర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా డిపార్ట్‌మెంట్స్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సీఎం సూచించారు. ంఎ టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా బ్జడెట్‌ను తయారు చేసుకోవాలన్నారు. భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచనలు చేశారు. ఊహాజనిత బ్జడెట్ కాదని.. వాస్తవికత ఆధారంగానే బ్జడెట్‌ను రూపొందించుకోవాలని అధికారులకు తెలిపారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.






అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

## ఆట





# గ్రూప్ స్టేజ్ నుంచే నిష్క్రమించిన టీమిండియా

మహిళల టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరెట్‌లలో ఒకటిగా బరిలోకి దిగిన భారత జట్టుకు లీగ్ దశలోనే ఘోర పరాభవం ఎదురైంది. లార్డ్స్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన డూ ఆర్ డై మ్యాచులో భారత్ ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 170 పరుగుల భారీ స్కోరు చేసినప్పటికీ.. ఆసీస్ బ్యాటర్ ఎలీస్ పెర్రీ (56) మెరుపులతో కంగారూలు విజయం సాధించారు. దీంతో గ్రూప్–1 నుంచి ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లాయి. భారత్ వేదికగా జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో గెలిచి, తొలిసారి విశ్వకప్ గెలిచిన టీమిండియా మహిళల జట్టుకు టీ20 ప్రపంచకప్‌లో పరాభవం ఎదురైంది. ఇంగ్లాండ్ వేదికగా ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరెట్ జట్లలో ఒకటిగా బరిలోకి దిగిన హర్మన్ ప్రీత్ సారథ్యంలో భారత మహిళల జట్టు .. లీగ్ స్టేజ్ నుంచే నిష్క్రమించింది. ఈ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలై.. నాకౌట్ అవకాశాలను పోగొట్టుకుంది.

## హెడ్‌కోచ్ గౌతమ్

# గంభీర్‌పై ఐస్‌లాండ్ క్రికెట్ సెటైర్లు

ఐర్లాండ్ గడ్డపై టీమిండియాకు చరిత్రలోనే ఊహించని షాక్ తగిలింది. రెండు టీ20ల సిరీస్‌ను పసికూన ఐర్లాండ్ 2–0తో క్లీన్‌స్వీప్ చేసి భారత్‌కు ఘోర పరాజయాన్ని పరిచయం చేసింది. ఈ ఓటమితో భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్‌పై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే ఐస్‌లాండ్ క్రికెట్ అసోసియేషన్.. గంభీర్‌కు అసాధారణ ప్రతిభ ఉందంటూ, అలాంటి కోచ్ తమకు వద్దంటూ అధికారిక ఖాతాలో వేసిన సంచలన సెటైరికల్ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.టీ20 ఛాంపియన్‌గా ఐర్లాండ్ గడ్డపై అడుగుపెట్టిన భారత్‌కు.. భారీ భంగపాటు ఎదురైంది. పసికూన ఐర్లాండ్‌తో జరిగిన రెండు టీ20 మ్యాచ్‌లలోనూ టీమిండియా పరాజయం పాలైంది. దీంతో చరిత్రలో తొలిసారిగా ఆ జట్టు చేతిలో సిరీస్ ఓడిపోయింది. అంతేకాకుండా మూడేళ్ల తర్వాత ఓ ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో ఓటమి నమోదు చేసింది. దీంతో టీమిండియాపై నెట్టింట దారుణంగా ట్రోల్స్ వస్తున్నాయి. హెడ్‌కోచ్‌గా గౌతమ్ గంభీర్ నియమితుడయ్యాక టీమిండియా.. టెస్టుల్లో ఆశించిన మేర రాణించట్లేదు. దీంతో అతడిపై ట్రోల్స్ వస్తుంటాయి. అయితే వన్డేలు, టీ20ల్లో మాత్రం సత్తాచాటుతోంది. కానీ తాజాగా ఐర్లాండ్ చేతిలో ఓటమి తర్వాత.. గంభీర్ మరోసారి ట్రోలర్స్‌కు టార్గెట్ అయ్యాడు. కానీ ఇప్పుడు ఈ జాబితాలో ఐస్‌లాండ్ క్రికెట్ కూడా చేరిపోయింది. ఇప్పటి వరకు ఐసీసీ సభ్యదేశం కూడా కాని ఐస్‌లాండ్ క్రికెట్ అసోషియేషన్ కూడా తన సోషల్ మీడియాలో గంభీర్‌ను ట్రోల్ చేసింది. "మేం (ఐస్‌లాండ్ క్రికెట్) గౌతమ్ గంభీర్‌ను మా కోచింగ్ స్టాఫ్‌గా తీసుకోవాలని అనుకోవడం లేదు. ఒకరకంగా మారు ఇలా చేయడం ఇష్టం లేదు కూడా. గంభీర్‌లో అద్భుతమైన ప్రతిభ ఉంది. కానీ భారత ఆటగాళ్లను తీసుకొచ్చి.. ఐర్లాండ్‌లో ఇలాంటి ఫలితాలను అందించాలంటే అసాధారణమైన ప్రతిభ కావాలి. అది గౌతమ్ గంభీర్ వద్ద పుష్కలంగా ఉందనిపిస్తోంది" అని ఐస్‌లాండ్ క్రికెట్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. మరోవైపు పసికూన ఐర్లాండ్ చేతిలో రెండు టీ20ల సిరీస్‌ను టీమిండియా కోల్పోవడం పట్ల మాజీల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. చిన్న జట్టు అనే ఉదాసీనతే భారత జట్టు ఓటమికి కారణమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఐర్లాండ్‌ను లైట్ తీసుకోవడం వల్లే.. చరిత్రలోనే అతి భయంకరమైన ఓటమి ఎదురైందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా బ్యాటర్ల షాట్ల ఎంపిక దారుణంగా ఉందని విమర్శలు సైతం వస్తున్నాయి. టాప్ ఆర్డర్ వైఫల్యం కూడా టీమిండియా కొంపముంచింది.



# ఇంగ్లాండ్ సిరీస్‌లో వైభవ్‌ను ఆడించాలి

## అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే

ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత టాప్ ఆర్డర్ ఘోరంగా వైఫల్యం చెంది, చరిత్రలోనే తొలిసారి సిరీస్ ఓడిపోవడంతో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఆడించకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీనిపై అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే స్పందించాడు. వైభవ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వంద శాతం సిద్ధంగా ఉన్నాడని, అయితే సంజూ శాంసన్ వంటి సీనియర్లకు తగినంత సమయం ఇవ్వడం కోసమే అతడిని వెయిటింగ్‌లో ఉంచామని స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2026తో పాటు ఇటీవల జరిగిన ట్రై సిరీస్‌లోనూ అదరగొట్టిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌లో ఆడించకపోవడంపై టీమిండియా మేనేజ్‌మెంట్‌పై ప్రశ్నల వర్షం కురుస్తోంది. బ్యాటర్ల దారుణ ప్రదర్శనతో చరిత్రలోనే తొలిసారిగా ఐర్లాండ్ చేతిలో భారత్ ఓడిపోవడంతో విమర్శలు తీవ్రత మరింత ఎక్కువైంది. సూపర్ ఫామ్‌లో ఉన్న వైభవ్‌ను ఆడించకపోవడంపై మాజీలు సైతం గుర్రుగా ఉన్నారు. ఇదే విషయంపై టీమిండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే మాట్లాడాడు. దీనిపై వివరణ ఇచ్చాడు. "వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ విషయంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. అదే సమయంలో సంజూ శాంసన్ వంటి టీ20 ప్రపంచకప్ 2026 హీరో కూడా జట్టుతోపాటు ఉన్నాడు. ఐపీఎల్‌లో వీరిద్దరూ మెరుగైన ప్రదర్శన చేశారు. ఆటగాళ్లకు భరోసా ఇవ్వడంతోపాటు.. తమను తాము నిరూపించుకునేందుకు జట్టులో వారికి తగినంత సమయం కల్పిస్తామనే సందేశాన్ని అందించడం చాలా ముఖ్యం. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మేం ముందుకు సాగుతాం" అని ర్యాన్ టెన్ డస్కాటే వివరించాడు. ఇదే సమయంలో వైభవ్.. ఎప్పుడు డెబ్యూ చేస్తాడనే విషయంపై కూడా మాట్లాడాడు.

# అంతర్జాతీయ తపాలా ఉద్యోగుల దినోత్సవం సందర్భంగా చెన్నూరులో తపాలా అధికారి అడువాల వెంకటస్వామికి ఘన సత్కారం:




**అర్జున్ సమాచారం । జులై 01 జైపూర్ ప్రతినిధి:**

చెన్నూరు ప్రతినిధి:అంతర్జాతీయ తపాలా ఉద్యోగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని చెన్నూరు పట్టణ తపాలా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తపాలా అధికారి అడువాల వెంకటస్వామిని చెన్నూరు సింహసేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సంఘం మండల బాధ్యుడు జాడి తిరుపతి, అధ్యక్షుడు నిమ్మల సాగర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. సమాచార వ్యవస్థ బలోపేతానికి, ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరవేయడంలో తపాలా శాఖ విశిష్ట పాత్ర పోషిస్తోందని కొనియాడారు. సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందినా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు విశ్వసనీయ సేవలు అందించడంలో తపాలా శాఖకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు.చెన్నూరు తపాలా అధికారిగా అడువాల వెంకటస్వామి నిబద్ధతతో ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ సత్కారం నిర్వహించినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో ఖజానాదారు సౌడం శ్రీనివాస్, కార్యదర్శి కప్ప ప్రతాప్ సింగ్, కట్ట సదానందం, సౌడం సంతోష్, బుద్ధారపు ప్రకాశ్ బాబు, సంపత్ పాల్గొని అడువాల వెంకటస్వామికి శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

# ప్రజా సేవల దరఖాస్తుల నమోదుపై మీ సేవ నిర్వాహకులకు శిక్షణ:




**అర్జున్ సమాచారం । జులై 01 జైపూర్ ప్రతినిధి:**

మంచిర్యాల ప్రతినిధి:దివ్యాంగుల గుర్తింపు నమోదుతో పాటు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తుల నమోదు ప్రక్రియపై జిల్లాలోని మీ సేవ నిర్వాహకులకు శిక్షణ నిర్వహించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య తెలిపారు.బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, ఇతర అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా పి. చంద్రయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 133 మంది మీ సేవ నిర్వాహకులకు దివ్యాంగుల గుర్తింపు నమోదు వ్యవస్థలోని ఇరవై రకాల దివ్యాంగత్వాల నమోదు విధానం, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తుల నమోదు ప్రక్రియపై సమగ్ర శిక్షణ అందించినట్లు తెలిపారు.వివరాల నమోదు సమయంలో పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దరఖాస్తుల్లో తప్పులు జరగకుండా అనుసరించాల్సిన విధానాలను వివరించినట్లు చెప్పారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలు తీరు, దరఖాస్తుల నమోదు విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దివ్యాంగుల గుర్తింపు నమోదు వ్యవస్థ పర్యవేక్షకుడు శ్రీధర్, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి అంజయ్య, జిల్లా సేవల నిర్వహణ అధికారి సునీల్, అన్నాజీ, రాజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌పై పోలీసుల కాల్పులు..

## బొంగులూరు ఓఆర్ఆర్ వద్ద ఉద్రిక్తత

రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ వద్ద గతరాత్రి ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఓ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌ను పట్టుకునే ఆపరేషన్‌లో భాగంగా పోలీసులకు, నిందితుడికి మధ్య జరిగిన ఘర్షణ కాల్పులకు దారితీసింది. తనను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించిన పోలీసుల పైకి నిందితుడు కత్తితో దూసుకురావడంతో, ఆత్మరక్షణ కోసం పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ ఘటనలో నిందితుడి రెండు కాళ్లకు గాయాలు కాగా, విధి నిర్వహణలో ఉన్న ఓ హెడ్ కానిస్టేబుల్ సైతం గాయపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపూర్‌కు చెందిన బూష్మి శ్రీకాంత్ అనే కరుడుగట్టిన నేరస్థుడిపై సుమారు 120కి పైగా కేసులు ఉన్నాయి. గతంలో ఇతడిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించిన ఐడీ పార్టీ కానిస్టేబుల్ వేణుబాబును శ్రీకాంత్ దారుణంగా హత్య చేసి పరారయ్యాడు. కేవలం నల్లగొండ జిల్లాలోనే ఇతనిపై 30కి పైగా కేసులు నమోదు కావడం గమనార్హం. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న శ్రీకాంత్ కోసం గత వారం రోజులుగా పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో శ్రీకాంత్ హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా ఓ డీసీఎం వాహనంలో ప్రయాణిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో బొంగులూరు ఎగ్జిట్ వద్ద మాటువేసిన పోలీసులు అతడిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. తప్పించుకునే మార్గం లేక శ్రీకాంత్, పోలీసులపై కత్తితో దాడికి తెగబడ్డాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆత్మరక్షణ కోసం అతడిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నిందితుడి రెండు కాళ్లకు బుల్లెట్లు తగిలాయి. కాగా, నిందితుడు చేసిన దాడిలో నల్లగొండ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అప్రమత్తమైన ఇతర సిబ్బంది, గాయపడిన నిందితుడిని మరియు హెడ్ కానిస్టేబుల్‌ను హుటాహుటిన సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు.

# నిర్లక్ష్యం సహించం

## అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కఠిన హెచ్చరిక




రాష్ట్రంలో ఆదాయ సమీకరణ, నిధుల పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ప్రధానంగా రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూర్చే కీలక శాఖల పనితీరును ముఖ్యమంత్రి ఈ సందర్భంగా లోతుగా సమీక్షించారు. ఆదాయ పెంపు లక్ష్యంగా ప్రతి శాఖ తమ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, గనులు తదితర కీలక శాఖల్లో ఎలాంటి లీకేజీలు లేకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పనుల పురోగతిని, నిధుల సమీకరణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా 'చేజింగ్ సెల్' ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల నిమిత్తం చేపట్టే భూసేకరణకు అధికారులు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు.ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసే వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. అదే సమయంలో ఆదాయ పెంపు, నిధుల సమీకరణ విషయంలో అధికారులు ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా, నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని ఆయన తేల్చిచెప్పారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ప్రగతికి తోడ్పడాలని సూచించారు.

# సొంత రాష్ట్రాన్నే కించపరుస్తున్న ముఖ్యమంత్రి

## రేవంత్ రెడ్డి తీరుపై కేటీఆర్ తీవ్ర ధ్వజం



తెలంగాణ రాష్ట్రానికి ఒక అల్పుడు, తుచ్చుడు ముఖ్యమంత్రిగా ఉండటం ప్రజల దురదృష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కె టి ఆర్ మాటల్లో చెప్పాలంటే ఒక 'అంగుష్ఠ మాత్రుడు' ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్నారని, ఎవరైనా తాము దరిద్రులమని మెడలో బోర్డు వేసుకుని తిరగరని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం మైకు దొరికితే నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.గత 30 నెలల కాలంలో ముఖ్యమంత్రి అనేకసార్లు రాష్ట్రాన్ని కించపరిచేలా మాట్లాడారని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణను ఎయిడ్స్ రోగిగా, క్యాన్సర్ పేషెంట్‌గా అభివర్ణించడం, రాష్ట్రం దివాలా తీసిందని పదేపదే దివాలాకోరు మాటలు మాట్లాడటం ఆయన భావ దారిద్ర్యానికి నిదర్శనమన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి కూడా తన రాష్ట్రాన్ని తానెలా అవమానించు కోలేదని స్పష్టం చేశారు. ప్రజలు నమ్మి మార్పు కోసం అవకాశం ఇచ్చారని, ప్రభుత్వానికి ఇచ్చిన ఐదేళ్ల కాలంలో సగం పూర్తయినా తమ విజయాల గురించి ఒక్క మంచి మాట కూడా చెప్పలేక పోతున్నారని విమర్శించారు. జిల్లాల పర్యటనలకు వెళ్లినప్పుడు చేసిన అభివృద్ధిని వివరించాల్సింది పోయి, అన్నం తినే కంచంలోనే మన్ను పోసుకున్నట్లు సొంత రాష్ట్రాన్ని తిట్టడం అత్యంత దారుణమని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.ఢిల్లీకి వెళ్తే తనకు కనీస ఇజ్జత్ (గౌరవం) దక్కడం లేదని ముఖ్యమంత్రే స్వయంగా చెబుతున్నారని, అలాంటప్పుడు ఈ 30 నెలల కాలంలో ఏకంగా 72 సార్లు ఎందుకు వెళ్లారని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. నెలకు కనీసం రెండున్నర సార్లు ఢిల్లీ చుట్టూ తిరుగుతూ, ఏ ముఖ్యమంత్రి సాధించని రికార్డును ఆయన సృష్టించారని ఎద్దేవా చేశారు. అసలు అక్కడ గౌరవం లేనప్పుడు ఢిల్లీకి ఎవరు రమ్మన్నారని, ఎందుకు పదే పదే వెళుతున్నారని నిలదీశారు. ప్రభుత్వ అధినేతగా ఉంటూ తన రాష్ట్రంపైనే విషం చిమ్మే పని ఇంకెన్ని రోజులు చేస్తారో అర్థం కావడం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# వైద్యులు దేవుళ్లతో సమానం.. వారి సేవలు మరువలేనివి: ఎంపీ ఈటెల రాజేందర్




రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని వనస్థలిపురంలో జాతీయ వైద్యుల దినోత్సవ (డాక్టర్స్ డే) వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక లక్ష్మీ హెల్త్ కేర్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన రీహాబిలిటేషన్ వార్డును మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ బుధవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు వైద్యులకు అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, అందుకే డాక్టర్లను భగవంతునితో పోలుస్తూ 'వైద్యో నారాయణో హరి' అంటారని పేర్కొన్నారు. తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులు నిజమైన త్యాగధనులని ఆయన కొనియాడారు. ఆసుపత్రికి ఎంత మంది రోగులు వచ్చినా అత్యంత ఓపికతో వారు సేవలు అందిస్తారని ప్రశంసించారు. కరోనా విపత్కర పరిస్థితులను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. మహేంద్ర హిల్స్ ప్రాంతంలో తొలి కరోనా కేసు నమోదైనప్పుడు చుట్టుపక్కల ప్రజలంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారని, ఆ సమయంలో రోగిని వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించామని తెలిపారు.అప్పట్లో అందరూ భయపడుతున్న తరుణంలో నాటి వైద్యారోగ్య శాఖ కెప్టెన్‌గా తాను స్వయంగా ఆసుపత్రికి వెళ్లి వైద్యుల్లో, ప్రజల్లో ధైర్యం నింపానని ఈటెల గుర్తుచేశారు. ఒక యుద్ధం తరహాలో అహర్నిశలు పనిచేసి పీపీఈ కిట్లు, శానిటైజర్లు, మందులు సమకూర్చామని వివరించారు. మనిషి తనను తాను ఎంత గొప్పగా ఊహించుకున్నా, ప్రకృతి ప్రకోపిస్తే ఎలా విలవిలలాడతాడో కరోనా సమయంలో అందరం కళ్లారా చూశామని వ్యాఖ్యానించారు. అలాంటి విపత్కర కాలంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించిన డాక్టర్లు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులందరికీ ఆయన ఈ సందర్భంగా మరోసారి ప్రత్యేకంగా వందనాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాసరెడ్డి, మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, నాయకులు రానా ప్రతాప్, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్వేత వంశీ, డాక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి : డీఈఓ వాసంతి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాధికారి డి.వాసంతి అన్నారు. బుధవారం ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్.సతీష్ కుమార్‌తో కలిసి కొత్తగూడెం, చుంచుపల్లి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించి విద్యా బోధన, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. ముందుగా రైటర్ బస్తి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాధికారి, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడాన్ని గమనించి పాఠశాలల్లో నమోదు (ఎన్‌రోల్మెంట్) పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఆమె స్వయంగా ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ సంయుక్త అక్షరాలను నేర్పించారు.తదుపరి కొత్తగూడెం భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చుంచుపల్లి భవిత కేంద్రంలో విద్యార్థుల హాజరు తక్కువగా ఉండడంపై ఆరా తీసిన ఆమె, ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులకు అందజేసిన టీచింగ్ అండ్ లెర్నింగ్ మెటీరియల్ ను తప్పనిసరిగా వినియోగించి బోధనను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం బాబు క్యాంపు ప్రాథమిక పాఠశాలను పరిశీలించి ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని గమనించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాబు క్యాంపులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన జిల్లా విద్యాధికారి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రతి విద్యార్థికి వారానికి మూడు గుడ్లు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.



PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక








# 'పెద్ది' ఓటీటీ రిలీజ్‌పై కొత్త ట్విస్ట్.. జూలై 2న రావడం లేదా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. గ్రామీణ నేపథ్యంలోని స్పోర్ట్స్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని భారీ వసూళ్లు రాబట్టింది. థియేటర్లలో విజయవంతమైన ప్రదర్శన తర్వాత ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ విడుదలపై ఆసక్తికరమైన ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. థియేటర్లలో మంచి స్పందన దక్కించుకున్న 'పెద్ది'ని ఓటీటీలో ఎప్పుడు చూడొచ్చా అని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, బుచ్చిబాబు సాన ఎమోషనల్ టేకింగ్‌ను మరోసారి ఆస్వాదించాలని అభిమానులు భావిస్తున్నారు.'పెద్ది' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. గత కొన్ని రోజులుగా ఈ సినిమా జూలై 2, 2026 నుంచి స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వస్తుందనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. సినిమా జూన్ 4న థియేటర్లలో విడుదల కావడంతో నాలుగు వారాల తర్వాత ఓటీటీలోకి వస్తుందని భావించారు. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ డిజిటల్ విడుదలను మరో రెండు వారాలు వాయిదా వేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో జూలై 16, 2026న 'పెద్ది'ని నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

# సమంత పోరాటం ఇంకా ముగియలేదు.. జీవితాంతం నరకం తప్పలేదా?



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత జీవితంలో ఎదురైన వ్యక్తిగత, ఆరోగ్య సమస్యలు ఆమెను ఎంతో ఇబ్బందికి గురి చేశాయి. వ్యక్తిగత జీవితంలో ఎదురుదెబ్బలు, ఆ తర్వాత అరుదైన ఆటోఇమ్యూన్ వ్యాధి మయోసైటిస్‌తో చేసిన పోరాటం గురించి ఇప్పటికే అందరికీ తెలిసిందే. తాజాగా దర్శకురాలు నందిని రెడ్డి చేసిన వ్యాఖ్యలు మరోసారి సమంత ఆరోగ్య పరిస్థితిపై చర్చకు దారితీశాయి. కొన్ని సంవత్సరాల క్రితం సమంత తనకు మయోసైటిస్ అనే ఆటోఇమ్యూన్ వ్యాధి ఉన్నట్లు వెల్లడించారు. ఈ వ్యాధి కారణంగా కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండి చికిత్స తీసుకున్నారు. ఆరోగ్యంపై పూర్తిగా దృష్టి పెట్టేందుకు ఆమె సినీ కెరీర్‌కు కూడా విరామం ఇచ్చారు.

# హైలెస్సోలో లైలం బాబుగా



సుడిగాలి సుధీర్ ఉరఫ్ సుధీర్ ఆనంద్ కథానాయకుడిగా రూపొందుతున్న గ్రామీణ నేపథ్య యాక్షన్ డ్రామా 'హైలెస్సో'. ప్రసన్నకుమార్ కోట దర్శకుడు. వజ్ర వరాహి పతాకంపై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్న ఈచిత్రంలో ప్రముఖ నటుడు శివాజీ 'లైలం బాబు' అనే పవర్‌ఫుల్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం శివాజీ పుట్టిన రోజు సందర్భంగా ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు.నల్లటి దుస్తులు, పంచెకట్టుతో రాతి సింహాసనంపై కూర్చొని, చేతిలో సోడా సీసా పట్టుకొని సీరియస్‌గా చూస్తున్న శివాజీని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. శివాజీ ఇందులో అత్యంత పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపిస్తారని, ఆయన పాత్ర సినిమాకే హైలైట్‌గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. నటాషా సింగ్, నక్ష శరణ్ కథానాయికలుగా నటిస్తున్న ఈచిత్రంలో కన్నడ నటి అక్షర గౌడ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శరణ్య ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సుజాత సిద్ధార్థ్, సంగీతం: అనుదీప్ దేవ్.

# ఆలియాకు ప్రభాస్ సపోర్ట్.. 'కల్కి 2' రూమర్స్‌కు మరింత బలం చేకూర్చిన ఒక్క పోస్ట్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. సహ నటీనటుల సినిమాలకు ఎప్పుడూ అండగా నిలిచే డార్లింగ్.. ఈసారి బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ నటించిన ఆల్ఫా సినిమా ట్రైలర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. అయితే ప్రభాస్ చేసిన ఈ చిన్న పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ప్రభాస్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో 'ఆల్ఫా' ట్రైలర్‌ను పంచుకుంటూ.. ఆలియా భట్‌తో పాటు మొత్తం చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. సాధారణంగా తనకు నచ్చిన సినిమాలు, తనతో సన్నిహితంగా ఉండే నటీనటుల చిత్రాలకు ప్రభాస్ ఇలా మద్దతు తెలుపుతుంటారు. కానీ ఈసారి ఆయన పోస్ట్‌కు మరో ప్రత్యేక కారణం ఉందంటూ అభిమానులు చర్చించుకుంటున్నారు





# విభిన్న కథతో హ్యాంగ్‌మెన్

బ్రహ్మాజీ ప్రధానపాత్రలో నటించిన విభిన్న కథాచిత్రం 'హ్యాంగ్‌మెన్'. విహాన్ దర్శకుడు. వి.శ్రీకాంత్ మైసూర్, వీహెచ్ రావు నిర్మాత. ఈ నెల 3న నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానున్నది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించారు. పద్మశ్రీ డా.బ్రహ్మానందం, నందినీరెడ్డి, అద్దంకి దయాకర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'ఇలాంటి ఓ విభిన్నమైన కథకు కథానాయకుడిగా నన్ను అనుకున్న దర్శకుడు విహాన్‌కి రుణపడి ఉంటాను' అని నటుడు బ్రహ్మాజీ అన్నారు. హార్డ్ హిట్టింగ్‌గా ఉండే సినిమా ఇదని, ఇది ఇప్పటివరకూ రాని కొత్త సబ్జెక్ట్ అని దర్శకుడు విహాన్ తెలిపారు. ఇంకా అజయ్ మైసూర్, ఉదయ్ గుర్రాల, రూపక్, రియల్ హ్యాంగ్‌మెన్ పవన్, సంగీత దర్శకుడు కమ్రాన్, ఎడిటర్ కార్తీక్, శశికిరణ్ కూడా మాట్లాడారు.



## తాగునీటి సమస్యల పరిష్కారంపై నాగేపల్లిలో గ్రామ సభ



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 01

రామగిరి మండలం నాగేపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం గ్రామ సర్పంచ్ కొండవెన దివ్యసుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా సమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో తాగునీటి సరఫరా, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా గ్రిడ్ ఏఈ మధు తాగునీటి సరఫరా వ్యవస్థ, నీటి పంపిణీ విధానం, సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై గ్రామస్తులకు వివరించారు. అనంతరం గ్రామ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఉపసర్పంచ్ యాసం సతీష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వికలాంగులకు త్రిచక్ర వాహనాల పంపిణీ!



అర్జున సమాచారం:మంచిర్యాల జిల్లా. ప్రతినిధి:

సింగరేణి బొగ్గుగనుల సంస్థ శ్రీరాంపూర్ ప్రాంత ప్రధానాధికారి మునుగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇందారం, రామారావుపేట, గుడిపల్లి, కాన్కూర్ గ్రామాలకు చెందిన వికలాంగులకు త్రిచక్ర వాహనాలు పంపిణీ చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సంస్థ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాధికారి మునుగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, వికలాంగుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా, వారి దైనందిన రాకపోకలు సులభంగా సాగేందుకు త్రిచక్ర వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అవసరమైన వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజా సంక్షేమానికి తోడ్పడే కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు. త్రిచక్ర వాహనాలు అందుకున్న వికలాంగులు సింగరేణి బొగ్గుగనుల సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సౌకర్యంతో తమ రోజువారీ పనులు సులభంగా నిర్వహించుకునే అవకాశం కలిగిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి అధికారులు, వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీఆరెస్ పేరు మార్పు వుండదు..కవిత

సికింద్రాబాద్, అర్జున్ సమాచారం ప్రతినిధి, జులై 01



టిఆర్ఎస్ పార్టీ పేరు మార్పు విషయం పై టిఆర్ఎస్ అధినేత్రి కవిత స్పందించారు. టిఆర్ఎస్ పేరు మార్పు ఉండబోదని తెలంగాణ రక్షణ సేన పేరు తమకే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘంలో దీనికి సంబంధించి ప్రక్రియ కొనసాగుతుందని, ప్రజల ఆశీస్సులు తమకే ఉన్నాయని అన్నారు. పార్టీ స్థాపించిన రెండు నెలల్లోనే ఇతర పార్టీలకు భయం ఏర్పడిందని, భవిష్యత్తులో టిఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు. చిలకలగూడ గాంధీ విగ్రహం వద్ద టిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొని జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజలకు ఉచిత విద్య, వైద్యం తీసుకువచ్చి వారి సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. సికింద్రాబాద్ ప్రజలకు తెలంగాణ ఉద్యమానికి దగ్గర సంబంధం ఉందని, ఎంతోమంది ఉద్యమకారులకు గత ప్రభుత్వాలు మోసం చేశాయని వారి పక్షాన ఉప్పల్ బగాయతులో పోరాటం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం కొత్త రాజకీయ శక్తి కోసం ఎదురు చూస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందారని పదేళ్లపాటు తానే సీఎం గా ఉంటానని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు.

### ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయవద్దు : సీఐటీయూ.

అర్జున్ సమాచారం । జులై 01 జైపూర్ ప్రతినిధి:



ఉపాధి హామీ చట్టాన్ని మార్చే కుట్రలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పేరును వి.బి.జి. రాంజీ పథకంగా మార్చడాన్ని వ్యతిరేకిస్తున్నమని కొత్త విధానంలో కేంద్రం వాటా 90 పైసల నుంచి 60 పైసలకు తగ్గించడం కూలీలకు నష్టమని ఆరోపించారు. పాత చట్టాన్ని కొనసాగించాలని, ఆన్‌లైన్ హాజరులో రెండో ఫోటో రద్దు చేయాలని, ఎండాకాలం బోనస్, పనిముట్లు ఇవ్వాలని, పని కల్పించకపోతే సగం కూలీ చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్, దుర్గం నాన్నయ్య, బొల్లం రాజేశం, జైనేని రాజయ్య, జైనేని భూమయ్య, స్వామి, రాంబాబు, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# రామగిరిలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణకు ఆరు క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల నియామకం

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 01



మంథని నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు రామగిరి మండలంలో ఆరు క్లస్టర్ ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ప్రకటించారు. మంథని నియోజకవర్గ ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కోఆర్డినేటర్, టీపీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలోని 47 పోలింగ్ బూతులకు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) నియమించగా, వారి పనితీరును సమన్వయం చేసేందుకు బూతులను ఆరు క్లస్టర్లుగా విభజించి ప్రతి క్లస్టర్‌కు ప్రత్యేక ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. నియమితులైన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లుగా ఆరెల్లి దేవక్క కొమురయ్య (మాజీ ఎంపీపీ), ఎరుకల బాపురావు (నాగేపల్లి మాజీ సర్పంచ్), కాజీపేట ఓదెలు (లద్నాపూర్ మాజీ సర్పంచ్), కొప్పుల గణపతి (మాజీ ఎంపీటీసీ), బత్తిని శ్రీనివాస్ (మాజీ ఎంపీటీసీ), ఈగ ప్రశాంత్ (కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు)లను నియమించారు. ప్రతి క్లస్టర్ ఇన్‌చార్జ్ తమ పరిధిలోని బీఎల్ఏలతో ప్రతిరోజూ సమన్వయం చేసుకుంటూ, బీఎల్వోలతో కలిసి ఓటర్ల వివరాల పరిశీలన, మ్యాప్డ్--అన్‌మ్యాప్డ్ ఓటర్ల జాబితాల ధృవీకరణ, అవసరమైన సవరణలను వేగవంతంగా పూర్తి చేసే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి ప్రతి అర్హుడి ఓటు హక్కు సక్రమంగా నమోదు అయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి రొడ్డ బాపన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పేరాల మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి పరిరక్షణకు నేడు మహాసదస్సు

అర్జున్ సమాచారం । జులై 01 జైపూర్ ప్రతినిధి:



సింగరేణి బొగ్గుగనుల సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన, సంస్థ భవిష్యత్తు, బొగ్గుగనుల అభివృద్ధి, ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించేందుకు నేడు క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎం.ఎన్.ఆర్. గార్డెన్స్‌లో సింగరేణి పరిరక్షణ మహాసదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు భారత రాష్ట్ర సమితి పార్టీ మాజీ శాసనసభ్యుడు, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆధ్వర్యం వహించనున్నారు. సింగరేణి సంస్థ తెలంగాణ ప్రజల జీవనాధారంగా, లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న సంస్థగా గుర్తింపు పొందిందని, అలాంటి సంస్థను మరింత బలోపేతం చేయడం కాలానుగుణ అవసరమని నిర్వాహకులు పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం ఒకే దారిలో సాగినప్పుడే సింగరేణి మరింత ప్రగతి సాధిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ మహాసదస్సులో బొగ్గుగనుల రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, కార్మికుల సమస్యలు, ఉద్యోగ భద్రత, కొత్త నియామకాల అవసరం, సంక్షేమ పథకాల అమలు, గనుల అభివృద్ధి, ఉత్పత్తి పెంపు, సంస్థ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు. కార్మికుల అభిప్రాయాలు, ప్రజల సూచనలకు ప్రాధాన్యం కల్పిస్తూ భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. సింగరేణి అభివృద్ధి అంటే కేవలం ఒక సంస్థ అభివృద్ధి మాత్రమే కాదని, బొగ్గుగని ప్రాంతాల ఆర్థిక ప్రగతి, వేలాది కుటుంబాల సంక్షేమం, స్థానిక వ్యాపారాల అభివృద్ధికి కూడా అది బలమైన ఆధారమని పేర్కొన్నారు. అందుకే సింగరేణి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సింగరేణి కార్మికులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు, బొగ్గుగని ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. సదస్సు విజయవంతానికి ఇప్పటికే విస్తృత స్థాయిలో ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సింగరేణి ప్రాంత ప్రజలు, కార్మికులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించి సదస్సును విజయవంతం చేయాలని మాజీ శాసనసభ్యుడు బాల్క సుమన్ పిలుపునిచ్చారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల భవిష్యత్తు, సంస్థ ప్రగతిపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఈ మహాసదస్సు కీలక వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆక్రమణదారు నుంచి నా భూమిని రక్షించాలి: రిటైర్డ్ ఉపాధ్యాయుడు బడితెల రామయ్య విజ్ఞప్తి

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 01



మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడలో తన సొంత స్థలాన్ని పొరుగువ్యక్తి ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాటు ప్రాణహాని బెదిరింపులకు పాల్పడుతున్నాడని రిటైర్డ్ ఉపాధ్యాయుడు బడితెల రామయ్య ఆరోపించారు. బుధవారం మంథని డివిజన్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన ఇంటికి దక్షిణం వైపున నివసించే మారుపాక రమేష్ తన స్థలాన్ని ఆక్రమించి గోడ, గేటు నిర్మించాడని తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణ కారణంగా తన ఇంటి గోడలకు పగుళు ఏర్పడి వర్షపు నీరు ఇంట్లోకి వస్తోందని, తాను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని చెప్పారు. తనను చంపేస్తామని బెదిరించిన ఘటనపై కూడా ఫిర్యాదు చేసినా స్పందన లేదని పేర్కొన్నారు. గతంలో మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించగా, జిల్లా పోలీసు అధికారులు మరియు మంథని సీఐకు సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయిందన్నారు. తన స్థలంలో అక్రమంగా పైప్‌లైన్ వేయడంతో పాటు గోడ నిర్మాణం జరిగిన విషయాన్ని మున్సిపల్ అధికారులు కూడా నిర్ధారించినప్పటికీ సమస్యను పరిష్కరించలేదని రామయ్య తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్, మంథని ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తన భూమిని ఆక్రమణదారుడి చెర నుంచి విడిపించి తనకు అప్పగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### 40 ఏళ్ల సేవలకు గుర్తింపుగా హోం గార్డుకు ఆత్మీయ వీడ్కోలు

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 01



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత 40 సంవత్సరాలుగా హోం గార్డుగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఐ. విధుమౌళికి బుధవారం అదనపు డీసీపీ (అడ్మిన్) కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. గోదావరిఖని సబ్ యూనిట్‌కు చెందిన హోం గార్డు నంబర్--303గా విధులు నిర్వహించిన ఐ. విధుమౌళిని అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్ పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాల పాటు పోలీసు శాఖకు అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ రమేష్, హోం గార్డ్స్ ఆర్ఐ పెద్దన్న, ఆర్ఐ (వెల్ఫేర్) రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవతో పాటు వ్యవసాయంలోనూ ఆదర్శం.. కేశనపల్లి సర్పంచ్ పెగడ తిరుమల

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 01

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామ సర్పంచ్ పెగడ తిరుమల ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తూనే రైతుగా వ్యవసాయ పనులు చేస్తూ నిరాడంబర జీవనశైలితో ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూనే, ఖాళీ సమయాల్లో తన వ్యవసాయ పనులను స్వయంగా నిర్వహిస్తున్నారు. వానాకాలం ప్రారంభం కావడంతో తన పొలంలో స్వయంగా విత్తనాలు వేస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అవసరమైన సందర్భాల్లో కూలి పనులకు వెళ్లడానికీ వెనుకాడకుండా శ్రమకు గౌరవం ఇస్తున్నారు. ప్రజాప్రతినిధి హోదాలో ఉన్నప్పటికీ ఎలాంటి ఆడంబరాలకు పోకుండా సాధారణ మహిళలా పొలంలో పనిచేస్తూ "ఏ పని చిన్నది కాదు.. కష్టపడి పనిచేయడమే గొప్పది"





అనే సందేశాన్ని తన ఆచరణ ద్వారా చాటుతున్నారని గ్రామస్థులు కొనియాడుతున్నారు. ప్రజాసేవతో పాటు వ్యవసాయాన్ని కొనసాగిస్తూ శ్రమనే సంపదగా భావిస్తున్న పెగడ తిరుమల యువతకు, మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, రైతు సంక్షేమం రెండింటినీ సమానంగా భావిస్తూ ఆమె ముందుకు సాగుతున్న సేవా దృక్పథం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthami-nagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.